క్లుప్తంగా

## పంటల సాగు వివరాలు నమోదు



మాగనూర్: రైతులు సాగుచేసిన పంటల సాగును క్షేత్రస్థాయిలో పరిశీలించి నమోదు చేస్తున్నామని, రైతులు వ్యవసాయ శాఖ అధికారులకు తమ పంటల వివరాలు అందజేయాలని ఏఈఓ హరిష్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని అమ్లెట్, అచ్చంపేట సమీపంలో పత్తి పంటలను పరిశీలించి పంట వివరాలను నమోదు చేశారు. గతంలో పత్తిపంటలో కాయ తొలుచు పురుగు ఉధృతి ఎక్కువగా ఉండేదని, ప్రస్తుతం వాటి ఉధృతి తగ్గి రసం పల్చే పురుగు అధికమై రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని తెలిపారు. రసం పిల్చే పురుగుల నివారణకు సకాలంలో వ్యవసాయశాఖ అధికారుల సూచనల మేరకు మందులు వాడటం ద్వారా నివారించవచ్చునని వివరించారు. కార్యక్రమంలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

## నేడు సంపూర్ణత అభియాన్

నర్వ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నీతి అయోగ్ కార్యక్రమంలో భాగంగా నేడు మండలంలోని సంపూర్ణత అభియాన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ శ్రీనివాసులు తెలిపారు. ఇందులో భాగంగా ఉదయం 9: 30 గంటలకు గ్రామ పంచాయతీ కార్యాలయం నుంచి ర్యాలీ, 10:50 పీహెచ్‌సీ వద్ద గ్యాథరింగ్, 11:00 గంటలకు యాత్ర ర్యాలీ పీహెచ్‌సీ నుంచి మండల సమైఖ్య, ఏపీజీవీ బ్యాంకు, తహసీల్దార్ కార్యాలయం మీదుగా రైతు వేదిక వరకు ర్యాలీ నిర్వహిస్తామన్నారు. అనంతరం 11: 45కు స్వాగత పాట, 12 :05 ప్రధానమంత్రి కీ నోట్, 12:30 సంపూర్ణత అభియాన్ ప్రార్థన, 12: 45 పీఎం స్టాల్స్ సందర్శన కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమాల్లో పాల్గొని విజయవంతం చేయాలన్నారు.

## రాయితీ పరికరాలకు దరఖాస్తు చేసుకోండి

మరికల్: ప్రభుత్వం అందజేసే రాయితీ బిందు సేద్యం పరికరాలకు ఆసక్తిగల రైతులు దరఖాస్తు చేసుకోవాలని డీలర్ వెంకటేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. కూరగాయలు, పత్తి, పండ్ల తోటలు, చెరకు సాగుచేసే రైతులు ఓసీలకు 5 ఎకరాల వరకు 90 శాతం, 5 ఎకరాలపై ఉంటే 80శాతం, బీసీలకు 90 శాతం, ఎస్సీ, ఎస్టీలు 100 శాతం సబ్సిడీతో అందజేస్తామన్నారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. వివరాలకు 6303753511 సంప్రదించాలని కోరారు.

## అమావాస్య ప్రత్యేక పూజలు



ఊట్కూరు: అమావాస్య సందర్భంగా మండలంలోని గ్రామ శివారులోని మూకి బసవన్న శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామివారికి పంచామృతాభిషేకం, బిల్వ మహామంగళహారతి తదితర ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ పూజా కార్యక్రమంలో భక్తులు తమ్మిరెడ్డి, అమ్మన్న, అంబు, వెంకటేష్, రాజు తదితర భక్తులు పాల్గొన్నారు.

## మట్టి టిప్పర్ పట్టివేత

మాగనూర్: మండల పరిధిలోని ఒబ్లాపూర్ గ్రామ గేట్ సమీపంలోని ఓ పొలం వద్ద ఎర్ర మట్టి తరలిస్తున్న టిప్పర్‌ను పట్టుకున్నట్లు తహసీల్దార్ సతీష్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. టిప్పర్‌కు ఎలాంటి ప్రభుత్వ అనుమతి లేకుండా పొలం వద్ద నుంచి ఎర్ర మట్టి మక్తల్‌కు తరలిస్తున్నట్లు తెలిసిందన్నారు. అయితే విధుల నిమిత్తం అటుగా వెళ్తున్న వీఆర్ఏలకు టిప్పర్ కనిపించడంతో ఆపి తనిఖీ చేయగా ఎర్ర మట్టికోసం తరలిస్తున్నట్లు గుర్తించి ఆర్ఐ శ్రీశైలంకు సమాచారం ఇవ్వడంతో టిప్పర్‌ను అదుపులోకి తీసుకుని పోలీస్‌స్టేషన్‌లో అప్పగించినట్లు పేర్కొన్నారు.

## గ్రామీణ వైద్యసేవలు ఎంతో అవసరం

దామరగిద్ద: గ్రామీణ వైద్యులు సేవలు మారుమూల గ్రామాల ప్రజలకు ఎంతో అవసరమని జిల్లా లయన్స్‌క్లబ్ సభ్యుడు హరినారాయణ బట్టడ్, భీమయ్యగౌడ్, అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని సంజీవరాయ ఆవరణలో డాక్టర్స్‌డే సందర్భంగా గ్రామీణ ఆర్‌ఎంపీ వైద్యులు వెంకట్రాములు, ప్రభాకర్‌గౌడ్, మొగులప్పను సన్మానించారు. ఈ మేరకు.. వారి సేవలను ప్రసంశించారు. కార్యక్రమంలో రవిగౌడ్, భీమ్, చంద్రగౌడ్, భీమయ్యగౌడ్, రవిందర్, సభ్యులు అశోక్, కన్కిరెడ్డి, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# మరమ్మతుకు నోచుకునేనా..?

- చెరువు తూముల లీకేజీలతో పారతున్న నీరు
- అసంపూర్తిగా మిషన్ కాకతీయ పనులు
- నియోజకవర్గంలో 349 చెరువులు, కుంటలు



కిష్టంపల్లి సున్నపురాళ్ల కుంటకు పడ్డ గండి



మరికల్‌లో మరమ్మతుకు నోచుకుని నాన్ చెరువు తూము

మరికల్: రైతులకు సాగునీరు అందించే చెరువులను ప్రభుత్వం పెద్దగా పట్టించుకోవడం లేదు. నియోజకవర్గంలో 349 చెరువులు ఉన్నాయి. సాగునీటి వనరులతోపాటు చేపల పెంపకం వంటి వాటికోసం చెరువులు, కుంటలపైనే రైతులు, మత్స్యకారులు ఆధారపడుతున్నారు. వీటి మరమ్మతు, నిర్వహణకు నిధుల లేమి వెంటాడుతోంది. గత ప్రభుత్వ హయంలో మిషన్ కాకతీయ కింద అసంతృప్తిగా చెరువుల మరమ్మతు పనులు చేపట్టారు. ఇప్పటికి తూములు, అలుగులు, పాటు కాల్వలు, పొలాలకు వెళ్లే కాల్వలు మరమ్మతులకు నోచుకోవడం లేదు. దీంతో వర్షాలకు చెరువులు నిండిన ప్రతిసారి లీకేజీ తూముల నుంచి నీరు వృథాగా బయటకు పోతుంది. భారీ వర్షాలకు చెరువులు, కుంటలు దెబ్బతింటే తాత్కాలిక మరమ్మతులతోనే సరి పెడుతారు.

| నియోజకవర్గంలోని చెరువులు, కుంటలు | |
|---|---|
| మండలం | ట్యాంకుల సంఖ్య |
| నారాయణపేట | 189 |
| దామరగిద | 72 |
| ధన్వాడ | 43 |
| మరికల్ | 45 |

మిషన్ కాకతీయ తర్వాత వీటి నిర్వహణపై దృష్టి సారించలేదు. కట్టలపై కాలినడకన కూడా వెళ్లలేని స్థాయిలో ముళ్లచెట్లు పెరిగాయి. తూములుమరమ్మతులకు గురైనా ఇంతవరకు చర్యలు తీసుకోకపోవడంతో చెరువులోకి వచ్చే వర్షపు నీరు లీకేజీ రూపంలో వృథావుతోంది. గతంలో ఉపా ధిహామీతో ఒండ్రు మట్టి తరలించేవారు. ఇది నీటి నిల్వకు దోహదపడేది, ప్రస్తుతం ఆ దిశగా కృషి చేయడం లేదు.

**నీటి వనరులపై అలస్యతం..**

నారాయణపేట నియోజకవర్గంలో పెద్దగా ఆశించిన స్థాయిలో సాగునీటి ప్రాజెక్టులు లేవు. ఎక్కువగా చిన్ననీటి వనరులే రైతులకు ఆధారం వీటిని కూడా అధికారుల సరిగా పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తుండటంతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. చెరువులు, తూములు, కాల్వలకు మరమ్మతులు చేపట్టడంలో ఎప్పటిక్కప్పుడు అలసత్యం ప్రదర్శిస్తున్నారు. వేసవిలో మరమ్మతు పనులు చేపట్టాల్సిన అధికారులు వర్షాకాలం మొదలైనా ఇప్పటి వరకు వాటిపై దృష్టి సారించలేదు. దీంతో పలు చెరువుల తూములు ఏళ్లుగా నిర్వహణ లేక తుప్పు పట్టి దుస్థితికి చేరాయి. మరికొన్ని చోట్ల బిగించిన తూములు, షటర్లు చోరికి గురయ్యాయి. కొన్ని ధ్వసమయ్యాయి. వాటి గురించి పట్టించుకోక పోవడంతో వర్షం వచ్చి చెరువులోకి చేరిన నీరు వృథాగా తూముల నుంచి బయటకు వెళ్లిపోతుందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

### మరమ్మతులకు నిధులివ్వాలి..



గ్రామాలకు, వ్యవసాయ బోర్లకు నీటి వనరులుగా నిలిచిన చెరువుల పూర్తిస్థాయి మరమ్మతులకు ప్రభుత్వం దృష్టి సారించి నిధులు మంజూరు చేయాలి. గత ప్రభుత్వం మిషన్ కాకతీయ పథకం కింద చెరువులను మరమ్మతులు చేసింది. అక్కడక్కడ తూములు, అలుగులు, పాటు కాల్వల మరమ్మతులకు నిధులు మంజూరైతే బాగుంటుంది. ఈ విషయంపై అధికారులు దృష్టి సారించాలి.

- ప్రకాష్, ఎలిగండ్ల

### తూములు లీకేజీ కాకుండా చూడాలి..



వర్షాలకు చెరువులు నిండితే తూముల ద్వారా నీరు వృథాగా పాతుంది. చెరువులో నీరు నిల్వ ఉంటే గ్రామానికి తాగునీటి వనరులతోపాటు సాగునీటి సమస్య కూడా కొద్ది వరకు తీరుంది. మరమ్మతులకు నోచుకుని చెరువులను మరమ్మతులు చేయాలి.

- కుర్మయ్య, మరికల్

### నిధులు మంజూరు చేయాలి..

మిషన్‌కాకతీయ తర్వాత చెరు వులకు నిధులు మంజూరు కాలేదు. ఎక్కడైన వర్షాలకు చెరువులు నిండి ఎదైన ప్రమా దం పొంచిఉంటే తప్పకుండా మరమ్మతు పనులు చేపడుతాం. దెబ్బతిన్న తూము లు, అలుగులు, కాల్వల మరమ్మతుల విషయాన్ని తమ ఉన్నత అధికారులకు నివేదిక అందజేస్తాం. నిధులు మంజూరైతే మరమ్మతులు చేయిస్తాం.

- కిరణ్‌కుమార్, డీఈఈ

# విద్యార్థులు కష్టపడి చదవాలి..

ఊట్కూరు: హస్టల్‌లో ఉన్న విద్యార్థులు కష్టపడి చదువుకొని తల్లిదండ్రులకు, గురువులకు మంచిపేరు తీసుకురావాలని కేజీబీవీ ఎస్ఓ కన్యాకుమారి అన్నారు. శుక్రవారం మండలంలోని ఎస్సీ బాలుర వసతిగృహాన్ని ఆమె తనిఖీ చేశారు. వంట గదిని పరిశీలించి విద్యార్థులకు అందిస్తున్న మెనూను అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులకు స్టడీ మెటిరీయల్‌ను అందించారు. ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం పేద విద్యార్థులకు హస్టల్‌లో అన్ని వసతులను ఏర్పాటు చేస్తుందని ఆమె అన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వార్డెన్ జగదీశ్వర్‌రెడ్డి, హస్టల్ సిబ్బంది పాల్గొన్నారు.



స్టడీ మెటీరియల్ అందిస్తున్న అధికారిణి కన్యాకుమారి

## డీకే అరుణకు సన్మానం



ధన్వాద: ఎంపీగా గెలుపొందిన డీకే అరుణకు శుక్రవారం మండల బీజేపీ నాయకులు శాలువాతో సన్మానించారు. ఈ మేరకు.. మహబూబ్‌నగర్ పార్టీ కార్యాలయంలో ఆమెను కలిసి మండల సమస్యలపై వివరించారు. కార్యక్రమంలో కిసాన్‌మోర్చా రాష్ట్రా కార్యదర్శి గోవర్ధన్‌గౌడ్, జిల్లా ఉపాధ్యక్షుడు మల్లయ్య, ఉదయభాను, మాకం సురేందర్, రఘువిర్‌యాదవ్ పాల్గొన్నారు.

**ఎస్ఐకి సన్మానం..**



దామరగిద్ద: నూతన ఎస్ఐగా పదవి బాధ్యతలు చేపట్టిన ఎస్ఐ పి. రాజుకు మండలంలోని మల్‌రెడ్డిపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఎస్ఐ వారితో మాట్లాడుతూ.. మండల విషయాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో మల్‌రెడ్డిపల్లికి చెందిన కాంగ్రెస్ నాయకులు శివకుమార్ సాయిలు, శ్రీనివాస్ ఉన్నారు.

# ప్రత్యేకాధికారుల పాలన ప్రారంభం



మక్తల్‌లో జాన్ సుధాకర్‌ను సన్మానిస్తున్న కార్యాలయ సిబ్బంది



మద్దూర్‌లో..



కృష్ణాలో..

మక్తల్: మండల పరిషత్ ప్రత్యేకాధికారిగా జిల్లా వ్యవసాయశాఖ అధికారి జాన్ సుధాకర్ నియమితులయ్యారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని ఆయన తెలిపారు. ఎంపీపీ, ఎంపీటీసీ, జెడ్పీటీసీల కాలం ముగియడంతో ప్రత్యేకాధికారులపాలన ప్రారంభమైంది. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది సన్మానించారు. ఎంపీడీఓ గోవింద్‌రావు, ఎంపీఓ ఫయాజ్ పాల్గొన్నారు.

**ప్రత్యేకాధికారిగా సుదర్శన్..**

మద్దూరు: మండల పరిషత్ ప్రత్యేకాధికారిగా జిల్లా సివిల్ సప్లయ్ అధికారి ఆర్. సుదర్శన్ నియమితులయ్యారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ప్రత్యేక అధికారిగా రెండు మండలాల అభివృద్ధికి తన వంతు కృషిచేస్తానని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ జయరాములు, సూపరింటెండెంట్ కృష్ణరావ్, ఎంపీఓ రామన్న సిబ్బంది సన్మానించారు.

మాగనూర్: మండల ప్రజాపరిషత్ పదవీకాలం ముగియడంతో తదుపరి పాలకవర్గం ఎన్నికయ్యేంత వరకు ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతుందని మండల ఇన్‌చార్జి ఎంపీడీఓ జైపాల్‌రెడ్డి శుక్రవారం తెలిపారు. ఈ మేరకు.. మండల ప్రత్యేక అధికారిగా కృష్ణమాచారి బాధ్యతలు స్వీకరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీఓ జైపాల్‌రెడ్డి మాట్లాడుతూ.. స్పెషల్ ఆఫీసర్ల హోదా మండల పరిషత్ డెవలప్‌మెంట్ స్థాయి కంటే ఎక్కువగా ఉండాలని సూచించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయనను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ జైపాల్‌రెడ్డి, జూనియర్ అసిస్టెంట్ రామకృష్ణరెడ్డి, వెంకట్రాములు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా: మండల పరిషత్ ప్రత్యేక అధికారిగా డీడబ్ల్యూఓ నర్సింహారావు శుక్రవారం పదవి బాధ్యతలు చేపట్టారు. ఈ మేరకు.. మండల పరిషత్ అభివృద్ధి అధికారి జానయ్య, ఎంపీఓ విజయలక్ష్మీ, సీనియర్ అసిస్టెంట్ చక్రపాణి ఆయనను అభినందించి పూలతో స్వాగతం పలికారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండల అభివృద్ధికి కృషి చేస్తానని, మండలంలోని అన్ని రాజకీయ పార్టీల నాయకులు తమకు సహాయ సహకారాలు అందించాలని విజ్ఞప్తి చేశారు.

## మట్టితో ఎద్దుల బొమ్మలు తయారీ



నారాయణపేట రూరల్: పట్టణంలోని శ్రీ హంస వాహిని స్కూల్‌లో శుక్రవారం ఆశాడశుద్ధ (మంటెద్దుల) అమవాస్యను పురస్కరించుకుని సమీపంలోని చెరువు నుంచి మట్టిని సేకరించి పిల్లలతో మట్టి ఎద్దులను తయారు చేయించారు. అనంతరం వాటిని ప్రదర్శనగా ఉంచి, పూజలు చేసి చిన్నారులకు మిఠాయిలు పంపిణీ చేశారు. చక్కటి ప్రతిమలు చేసిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో టీచర్లు సుజాత, సౌజన్య, శిరీష, రేవతి తదితరులు పాల్గొన్నారు.

# అంగన్‌వాడీ కార్యకర్తల నిరసన



మరికల్‌లో పోలీస్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

మరికల్: సీఎం రేవంత్‌ను కలిసేందుకు వెళ్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలను శుక్రవారం పోలీసులు అరెస్టుచేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తమ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లేందుకు వెళ్తుంటే అరెస్టు చేయడం పద్ధతి కాదన్నారు. అరెస్టుకు నిరసనగా పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేస్తు వారి సమస్యలను వినిపించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు చంద్రకళ, జయశ్రీ, సుమిత్ర, పద్మ, నాగమణి, లక్ష్మి, భారతమ్మ పాల్గొన్నారు.

మక్తల్: అంగన్‌వాడీ సమస్యలను పరిష్కరించాలని శుక్రవారం సీఎం రేవంత్‌ను కలిసేందుకు వెళ్తున్న కార్యకర్తలను పోలీసులు అరెస్టుచేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ మేరకు.. సీఐటీయూ జిల్లా కార్యదర్శి మంజుల మాట్లాడుతూ.. అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని, అంగన్వాడీలకు రెండు లక్షల రిటర్మెంట్ బెనిఫిట్ కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు రాధ, మంజుల, భాగ్యలక్ష్మి, విజయలక్ష్మి, రాధిక, సుబాషిని తదితరులు పాల్గొన్నారు.

మాగనూర్: అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం చేపట్టిన చలో కొడంగల్‌లో సీఎం ఇంటి ముట్టడిలో భాగంగా బయలుదేరిన యూనియన్ నాయకుల ఇండ్లకు వెళ్లి అక్రమ అరెస్టులు సరికాదని యూనియన్ జిల్లా ఉపాధ్యక్షుడు పుంజనూర్ ఆంజనేయులు విమర్శించారు. 40 సంవత్సరాలు ఐసీడీఎస్‌లో బడుగు బలహీన వర్గాలకు సేవలందించిన అంగన్‌వాడీలకు అతి తక్కువ రిటైర్మెంట్ బెనిఫిట్ అందిస్తూ అగౌరపరుస్తున్నారని విమర్శించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ శోభ, తులసి, జగదీశ్వరి, మహేశ్వరి, ముద్దమ్మ పాల్గొన్నారు.

## సంపూర్ణ పారిశుద్ధ్యంతోనే ఆరోగ్యకర జీవితం

అమరచింత: ప్రజలందరూ తమ ఇళ్లు, వార్డులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, అప్పుడే ఆరోగ్యంగా జీవిస్తామని మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్ మత్స్యశాఖ ఏడీ లక్ష్మప్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ అన్నారు. పట్టణంలోని మూడో వార్డులోని పలు కాలనీల్లో పర్యటించి మున్సిపల్ సిబ్బందితో పారిశుద్ధ్య పనులు నిర్వహించారు. కాశీకాలయం పక్కనే ఉన్న డ్రెయినేజీని పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నురుల్ నదీం, ఆర్ఐ కృష్ణయ్య, పారిశుద్ధ్య కార్మికులు జవాన్ చిన్న, ఖతాల్, కతలప్ప, మహేందర్, రాము తదితరులు పాల్గొన్నారు.

## చట్టాలపై అవగాహన

మద్దూరు: మండల కేంద్రంలోని మండల పరిషత్ సమావేశ మందిరంలో భారత ప్రభుత్వ నూతనంగా తీసుకొచ్చిన కొత్త న్యాయచట్టాలపై పేట జిల్లా జడ్జి ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జయరాములు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఈ సదస్సు ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఆసక్తి గల ప్రజలకు ఈ సదస్సు హాజరుకావాలని సూచించారు.

# పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ



దామరగిద్దలో మొక్కకు నీటిని పడుతున్న పీడీ రాజేశ్వరి



గుడెబల్లూర్‌లో..

దామరగిద్ద: పచ్చదనంతోనే పర్యావరణ పరిరక్షణ సాధ్యమని ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి, వాటిని ఎదిగే వరకు బతికించాలని మండల ప్రత్యేక అధికారి డీఆర్‌డీఓ, రాజేశ్వరి అన్నారు. శుక్రవారం మండలంలోని క్యాతన్‌పల్లిలో ఎవెన్యు ప్లాంటేషన్ మొక్కలను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నర్సరీలో పెంచిన మొక్కలను రైతుల పొలాల గట్ల మీద, రోడ్ల పక్కన ప్రభుత్వ పబ్లిక్ స్థలాల్లో నాటాలని సూచించారు. గ్రామాల్లో పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సీజనల్ వ్యాధుల బారిన పడకుండా జాగ్రత్త వహించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీఓ శ్రీధర్, ఎంపీఈఓ ఉదయ్‌శంకర్, ఈజీఎస్ ఏపీఓ జయమ్మ, గ్రామ పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

కృష్ణా: మండల పరిధిలోని గుడెబల్లూర్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు శుక్రవారం వనమహోత్సవంలో భాగంగా పాఠశాలలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చెట్లు వాటి ఉపయోగాలను విద్యార్థులకు వివరిస్తూ తమతమ ఇంటి పరిసరాల్లో కూడా తప్పనిసరిగ్గా మొక్కలు పెంచాలని సూచించారు. అదేవిధంగా చెట్లు మానవాళికి ఉపయోగపడే విధానంతోపాటు వాటి అవశ్యకతను వివరించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాసులు, అర్జున్, తిరుమలరావు, చంద్రశేఖర్, రాజన్న, నర్మద, భాగ్యమ్మ, విజయలక్ష్మీ పాల్గొన్నారు.

# ఉపాధి పనులపై గ్రామ సభ



ఉపాధి సామాజిక తనిఖీకి హాజరైన ప్రజలు

మద్దూరు: మండలంలోని 2023–24లో జరిగిన ఉపాధి పనులపై శుక్రవారం గ్రామ పంచాయతీ ఆవరణలో అధికారులు సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ ఏడాదిలో గ్రామంలో ఉపాధి కూలీలు రూ. 28లక్షల 36వేల 68 రూపాయాలు, మెటిరీయల్ కంపోనెంట్ లక్ష74వేల 8 రూపాయలు ఈ సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ గ్రామ సభకు కూలీలు గానీ, మేటిలు గానీ హాజరుకావకపోవడం గమన్హరం. గ్రామంలో చాటింపు వేసిన సామాజిక తనిఖీకి ఉపాధి కూలీలు రాలేదు. దీంతో తూతూ మంత్రంగా సామాజికి తనిఖీ నిర్వహించి అధికారులు వెళ్లిపోయారు. కార్యక్రమంలో ఉపాధి ఏపీఓ సిద్దేశ్వర్, పంచాయతీ కార్యదర్శి రామునాయక్, సామాజిక తనిఖీ సిబ్బంది పాల్గొన్నారు.

## ఆర్థికసాయం అందజేత

కొత్తకోట రూరల్: పెద్దమందడి మండల కేంద్రానికి చెందిన బోయ బాలరాజు (40) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం మృతి చెందాడు. స్థానిక కాంగ్రెస్ నాయకులు బాధిత కుటంబ ఆర్థిక పరిస్థితులను వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి దృష్టికి తీసుకెళ్లడంతో వెంటనే స్పందించిన ఎమ్మెల్యే రూ.5వేలు ఆర్థికసాయం పంపించారు. కాంగ్రెస్ నాయకులు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటస్వామి, వెంకటస్వామి, రవి, బుచ్చన్న, రామాంజనేయులు, కుర్మన్న, ఊషన్న, రాఘవేందర్, రాజశేఖర్ ఉన్నారు.

## విద్యార్థులకు వైద్య పరీక్షలు

అమరచింత: మండల కేంద్రంలోని ఎస్సీ వసతి గృహంలో చదువుకుంటున్న విద్యార్థులకు డీఎంఆర్ఎం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ద్వారా శుక్రవారం వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ రూపశ్రీ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు వసతి గృహ విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించామన్నారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉందని ముందస్తుగా వసతి గృహ విద్యార్థులకు ఆరోగ్య పరీక్షలను నిర్వహించి మాత్రలను అందిస్తున్నామని తెలిపారు. ప్రతి నిత్యం విద్యార్థులు పరిశుభ్రంగా ఉండాలని మల, చేతులను సబ్బు నీటితో కడుక్కోవాలని సూచించారు. జ్వరం వచ్చినట్లు అనిపిస్తే సమీపంలోని ఆస్పత్రికి వచ్చి వైద్య సేవలు పొందాలని కోరారు. వార్డెన్ బెనర్జీ, ఏఎన్ఎం, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

# ఎక్సైజ్ అధికారులతో కాలనీవాసుల వాగ్వాదం

అమరచింత: పట్టణంలోని రాజవళీ దర్గా సమీపంలో సారా అమ్ముతున్న వ్యక్తిని పట్టుకొనేందుకు వచ్చిన ఎక్సైజ్ శాఖ అధికారులను స్థానిక కాలనీవాసులు అడ్డుకున్న ఘటన శుక్రవారం చోటుచేసుకుంది. శివాజీనగర్‌కు చెందిన చున్ను అనే వ్యక్తి కల్తీ సారా అమ్ముతున్నాడనే సమాచారంతో ఎక్సైజ్ ఎస్ఐ కృష్ణకాంత్ ఆధ్వర్యంలో సదరు వ్యక్తి ఇంట్లో తనిఖీలు చేసేందుకు అమరచింతకు వచ్చారు. విషయం తెలుసుకున్న కాలనీవాసులు బెల్ట్ షాపులు, కల్తీ కల్లు అమ్ముతున్న వారిని పట్టుకోలేని ఎక్సైజ్ అధికారులు నిరుపేద వ్యక్తి అయిన చిన్ను ఇంటిలో ఎలా సోదాలు చేస్తారని ప్రశ్నించారు. దీంతో కాలనీవాసులు ఎక్సైజ్ పోలీసుల మధ్య వాదోపవాదాలు జరగగా.. మరోమారు కల్తీసారా అమ్మితే కాలనీవాసులమే పట్టిస్తామని చెప్పడంతో వెనుదిరిగారు. పట్టణంలో పవిత్ర స్థలాల వద్ద సారా అమ్మకాలు సరికాదని, అలాంటి అడ్డుకునేందుకు సహకరించాలని ప్రజలను ఎక్సైజ్ ఎస్ఐ కోరారు.

# బీజేపీ, బీజేవైఎం నాయకుల అరెస్టు



మక్తల్‌లో బీజేపీ నాయకుల అరెస్టు



మరికల్‌లో..

మక్తల్: నిరుద్యోగుల హామీలను పరిష్కరించడంలో విఫలం కావడంతో శుక్రవారం చేపట్టిన చలో కలెక్టర్‌రేట్ కార్యక్రమానికి వెళ్తున్న బీజేవైఎం నాయకులను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. ఈ మేరకు.. బీజేపీ నాయకుడు రాజుగౌడ్ మాట్లాడుతూ.. నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని డిమాండ్ చేశారు. అనంతరం సొంత పూచికలపై విడుదల చేశారు. కార్యక్రమంలో ఆంజనేయులు, నవీన్‌కుమార్, మహేందర్, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మరికల్: ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చినా హామీలను నెరవేర్చడంలో విఫలం కావడంతో శుక్రవారం చేపట్టిన చలో కలెక్టర్‌రేట్ కార్యక్రమానికి వెళ్తున్న బీజేపీ, బీజేవైఎం నాయకులను పోలీసులు అరెస్టు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల హామీ ప్రకారం నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించే వరకు తమ ఆందోళన ఆపేది లేదని వారు పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రాజేష్, వేణు, నరేష్‌గౌడ్, రమేష్, నిఖిల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

ధన్వాద: నిరుద్యోగులకు మద్దతుగా ఉద్యోగ క్యాలెండర్ విడుదల చేయాలని బీజేవైఎం నాయకులు తలపెట్టిన కలెక్టరేట్ ముట్టడిని పోలీసులు అడ్డుకుని ముందస్తు అరెస్టులు చేయడం శోచనీయమని బీజేవైఎం మండల అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం కార్యకర్తలను అరెస్టులు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచికత్తుపై విడుదల చేశారు. విష్ణువర్ధన్‌రెడ్డి, చరణ్‌దాస్, చక్రవర్ధన్, రవికుమార్, హరీష్‌కుమార్, ఆకాష్, బాలరాజు తదితరులు ఉన్నారు.

కృష్ణా: నిరుద్యోగ జేఏసీ పిలుపు మేరకు శుక్రవారం కలెక్టరేట్ ముట్టడికి వెళ్లనీయకుండా శుక్రవారం పీడీఎస్‌యూ నాయకులను స్థానిక పోలీసులు ముందస్తు అరెస్టుచేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం సొంత పూచికత్తుపై వారిని విడుదల చేశారు.